క్లుప్తంగా

కుంభకోణంలో దోషులకు శిక్ష తప్పదు


ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

మార్కాపురం: గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 2014 నుంచి 2019 మధ్య కాలంలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో 350 కోట్ల రూపాయల కుంభకోణం జరిగిందని ఈ అవినీతిలో బాధ్యులైన దోషులకు శిక్ష తప్పనిసరిగా పడుతుందని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి అన్నారు. ఆదివారం అసెంబ్లీ సమావేశాలు ముగిసిన అనంతరం సాక్షితో ఫోన్‌లో మాట్లాడారు. గత టీడీపీ ప్రభుత్వంలో దొంగ కంపెనీలు సృష్టించి టెండర్ లేకుండానే 350 కోట్ల రూపాయలు కేటాయించారన్నారు. దీనిపై ఇప్పటికే ఈడీ సోదాలు నిర్వహించి నిందితులను అరెస్టు చేస్తోందన్నారు. ఈ విషయం పై అసెంబ్లీలో చర్చ జరుగుతోందన్నారు. ఎంత మంది దోషులున్న ప్రభుత్వం వదిలే ప్రసక్తి లేదన్నారు. సమగ్రంగా ఈ అవినీతి కుంభకోణంపై దర్యాప్తు జరుగుతోందని ఎమ్మెల్యే అన్నారు.

శింగరకొండ దర్శిని


అలంకరణలో ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్టు

అద్దంకి: శుభకృత్ నామ సంవత్సరం. ఉత్తరాయణం పాల్గుణ మాసం శతభిష నక్షత్రం చతుర్ధశి తిథి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర ఆదివారం తెలిపారు. ఉదయం 5గంటలకు సుప్రభాత సేవ, 5.30 గంటలకు బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచహారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

పొగాకు వినియోగంతో నోటి క్యాన్సర్


క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్యురాలు

పెద్దదోర్నాల: పొగాకు, గుట్కాలను వినియోగించడం వల్ల క్యాన్సర్ వస్తుందని ప్రతి ఒక్కరూ వీటికి దూరంగా ఉండాలని సామాజిక ఆరోగ్య కేంద్రం దంత వైద్యురాలు డాక్టర్ కళాసంధ్య కోరారు. ఆదివారం ఆటో డ్రైవర్లు, భవన నిర్మాణ కార్మికులకు ఆమె అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు ధూమపానం, మద్యపానానికి దూరంగా ఉండాలని ఆమె కోరారు. కార్యక్రమంలో డాక్టర్ నయాజ్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ సేవలు వినియోగించుకోండి

పుల్లలచెరువు: గ్రామాల్లోని ప్రజలు ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ రాజ్యలక్ష్మి ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. ఈ నెల 20, 21వ తేదీల్లో పుల్లలచెరువు మండలంలోని కొమరోలు, నరజాములతండా సచివాలయాల పరిధిలో ప్రత్యేక ఆధార్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ క్యాంప్‌లో కేవలం 2010 నుంచి 2016 మధ్యలో ఆధార్ పొంది ఎటువంటి చిరునామా మార్పు చేసుకోని వారికి డాక్యుమెంట్ అప్‌డేట్ చేయనున్నట్లు స్పష్టం చేశారు.

వాహనం ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

మార్టూరు: జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఈఘటన ఆదివారం సాయంత్రం ఇసుక దరిశి సమీపంలో జరిగింది. 108 సిబ్బంది తెలిపిన వివరాల మేరకు.. స్థానిక ఇసుక దరిశి ఫ్లై ఓవర్ దిగువ భాగంలో తీవ్రగాయాలతో పడి ఉన్న వ్యక్తిని గమనించిన స్థానికులు 108కు ఫోన్ చేశారు. ఘటనాస్థలికి చేరుకున్న 108 సిబ్బంది అపస్మారక స్థితిలో పడి ఉన్న వ్యక్తిని గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గాయాల పాలైన అతని పేరు లక్ష్మయ్య అని కర్నూలు అని మాత్రమే చెప్పాడన్నారు.

స్పీడ్ గన్‌తో ప్రమాదాల నివారణ

టంగుటూరు: స్పీడ్ గన్‌తో ప్రమాదాలు నివారించవచ్చని ఎస్సై ఖాదర్‌బాషా సూచించారు. ఎస్పీ ఆదేశాల మేరకు స్థానిక టోల్ ప్లాజా వద్ద ఎస్సై ఖాదర్‌బాషా స్పీడ్‌గన్‌తో ఈ చలానాలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ అతివేగంగా పోతున్న 100 వాహనాలకు రూ.40,400 జరిమానా విధించారు. వాహనం నడిపే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. మద్యం సేవించి వాహనం నడపరాదన్నారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.


అమూల్ పాల కేంద్రంలో పాలు తీసుకొచ్చిన మహిళలు


వెన్న శాతం పరిశీలిస్తున్న సిబ్బంది

పల్లెల్లో పాల వెల్లువ

- ఆర్థికాభివృద్ధికి పాడిపరిశ్రమ చేయూత
- పశ్చిమాన 3.36 లక్షల గేదెలు
- మార్కాపురం డివిజన్ పరిధిలో 10 ప్రాంతీయ పశువైద్యశాలలు

మార్కాపురం: పల్లెల్లో పేద కుటుంబాల ఆర్థికాభివృద్ధికి పాడిపరిశ్రమ ఉపయోగపడుతోంది. ఇందుకు ప్రభుత్వ ప్రోత్సాహం కూడా తోడైంది. అమూల్ పాల డెయిరీతో పాటు ప్రైవేట్ పాల డెయిరీలు కూడా మహిళ రైతుల నుంచి పాలను సేకరిస్తున్నాయి. అమూల్ రాకతో పాడిపశువులు ఉన్న ఇళ్లల్లో సంతోషం వ్యక్తం అవుతోంది. వెన్న శాతం ప్రకారం పాల ధర ఉంటోంది.

మార్కాపురం పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ పరిధిలో బేస్తవారిపేట, సీఎస్ పురం, కంభం, గిద్దలూరు, హనుమంతునిపాడు, కనిగిరి, మార్కాపురం, పొదిలి, త్రిపురాంతకం, యర్రగొండపాలెంలో ప్రాంతీయ పశువైద్యశాలలు ఉన్నాయి. మొత్తం 3,36, 053 గేదెలు, 33, 810 ఆవులు, ఎద్దులున్నాయి. వ్యవసాయంలో నష్టాలొచ్చినా పాడిపరిశ్రమ మాత్రం రైతు కుటుంబాలను ఆదుకుంటోంది. మర్రిపూడిలో అమూల్ పాల సేకరణ ప్రారంభం కాగా మిగతా మండలాల్లో ప్రైవేట్ పాల డెయిరీలున్నాయి. త్వరలో మార్కాపురం ప్రాంతంలో కూడా అమూల్ పాల డెయిరీలు ప్రారంభం కానున్నాయి. పొదిలి మర్రిపూడి ప్రాంతాల్లో 30 పాల డెయిరీలుండగా బేస్తవారిపేటలో 1, కంభం, మార్కాపురం, పెద్దారవీడు ప్రాంతాల్లో 10, త్రిపురాంతకంలో 5, వెలిగండ్ల హనుమంతునిపాడులో 10, కొనకనమిట్లలో ఆవుల పాల డెయిరీ, పామూరు, సీఎస్ పురంలో 6 ఉన్నాయి. ప్రైవేట్ పాల డెయిరీ నిర్వాహకులు ప్రతి రోజూ పాల ఉత్పత్తి దారుల నుంచి పాలు సేకరిస్తున్నారు. వెన్న శాతాన్ని బట్టి లీటర్ పాల ధర 55 నుంచి 60 రూపాయల మధ్య ఉంటుండగా అమూల్ పాల కేంద్రాల్లో అయితే 72 నుంచి 78 రూపాయల మధ్య లీటర్ పాల ధర ఉంటోంది. ఒక్కో గేదె ఉదయం, సాయంత్రం కలిపి దాదాపు 6 నుంచి 7 లీటర్ల వరకు పాలిస్తున్నాయి. దీని ప్రకారం ఒక గేదె సగటున 6 లీటర్ల ప్రకారం ఇచ్చే పాలకు లీటర్ 60 రూపాయల ప్రకారం ప్రైవేటు డెయిరీలో అయితే 360 రూపాయలు వస్తుండగా, అమూల్ పాల కేంద్రల్లో పోస్తే లీటర్ సగటున వెన్న శాతాన్ని బట్టి 76 రూపాయలు ప్రకారం రోజుకు 456 రూపాయల ఆదాయం వస్తోంది. పాలిచ్చే గేదెకు రోజుకు 50 రూపాయల వరకు పచ్చి గడ్డి (3 కిలోలు), 30 రూపాయల ఎండు గడ్డి (2 కిలో), 50 రూపాయల దాణా రూపంలో ఖర్చు పెడుతున్నారు.

ప్రభుత్వ ప్రోత్సాహం:



పాడిపరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుంది. సబ్సిడీపై దాణామృతం ఇస్తోంది. పశుగ్రాసాల సాగుకు కూడా ప్రోత్సాహం ఉంది. త్వరలో మార్కాపురం డివిజన్‌లో కూడా అమూల్ పాల కేంద్రాలు వస్తాయి. పాల ఉత్పత్తిదారులకు గిట్టుబాటు ధర వస్తుంది.

వెంకట సుబ్బయ్య, డిప్యూటీ డైరెక్టర్ వెటర్నరీ మార్కాపురం

ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు


అలంకరణలో శ్రీవారు


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

- పెరుమాళ్లకు చక్రస్నానం
- పల్లకీ మోసిన మోతకాపులు

కొనకనమిట్ల: అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుని శ్రీవారి బ్రహ్మోత్సవాలు ఈ నెల 8వ తేదీ నుంచి 13 రోజుల పాటు వైభవంగా నిర్వహించారు. కోరిన కోర్కెలు తీర్చే కలియుగ వెంకటేశ్వరస్వామి రోజుకొక అవతారంలో దర్శనమివ్వటంతో భక్తులు స్వామివారిని దర్శించుకొని పునీతులయ్యారు. చివరి రోజు ఆదివారం పూర్ణాహుతి, వసంతోత్సవం, చక్రతీర్థం, ధ్వజారోహణ, కుంభప్రోక్షణ కార్యక్రమాలతో ఉత్సవాలు ముగిశాయి. ముందుగా శ్రీవారి పుష్కరిణిలో శ్రీవారికి, పెరుమాళ్ల స్వామికి చక్రస్నానం చేశారు. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాలను పల్లకీలో అలంకరించిన వాహనంపై వెలుగొండ పురవీధుల్లో వేదపండితుల మంత్రోచ్చరణలు, మేళతాళాలతో ఉత్సవం నిర్వహించారు. వేదపండితులు ప్రసాదాచార్యులు, పవన్‌కుమార్ శర్మ, యుగంధర్‌చార్యుల పర్యవేక్షణలో ఉభయదాతలు హోమాలు, అభిషేకాలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరగడానికి సహకరించిన అన్ని శాఖలవారికి, ఆలయ ఈఓ చెన్నకేశవరెడ్డి, చైర్మన్ సానికొమ్ము తిరుపతిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. బ్రహ్మోత్సవాలు జరిగిన 13 రోజుల పాటు స్వామివారి పల్లకిని మోతకాపులు మోసి తమ భక్తిని చాటుకున్నారు. తర్లుపాడు మండలం గండ్లోపల్లి గ్రామానికి చెందిన యాదవ కులస్తులు పూర్వం నుంచి ప్రతి ఏడాది నిర్వహించే ఉత్సవాల్లో శ్రీవారి పల్లకీ మోయటానికి రావటం ఆనవాయితీ. నిత్యం ఆలయంవద్ద ఉంటూ రోజూ నిర్వహించే కార్యక్రమాల్లో పాల్గొనటం మోతకాపుల ఆచారం. పూర్వం నుంచి వంశపారంపర్యంగా గండ్లోపల్లి గ్రామస్తులే స్వామివారి పల్లకీ మోయటం గర్వకారణం. ఉత్సవాలు ముగిసిన తరువాత మోతకాపులు ఉత్సాహంగా జరిగిన వసంతోత్సవంలో పాల్గొని సందడి చేశారు.

పోలేరమ్మ దర్శనం కోసం పోటెత్తిన భక్తులు

మార్కాపురం టౌన్: అల్లూరి పోలేరమ్మ అమ్మవారి దర్శనానికి ఉగాది పండుగ ముందు వచ్చే చివరి ఆదివారం కావడంతో భక్తులు అమ్మవారికి పూజలు చేసేందుకు పోటెత్తారు. వేలాది మంది భక్తులు రావడంతో అమ్మవారి ఆలయ ప్రాంగణమంతా భక్తుల క్యూ లైన్లతో కిటకిటలాడింది. ఈఓ చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది శ్రీధర్‌రెడ్డి తదితరులు ఏర్పాట్లు చేశారు. వచ్చిన భక్తులు సమీపంలో ఉన్న పుట్టలో పాలు పోసి నాగమయ్య శిలలకు పూజలు చేసి అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు చైర్మన్ భక్తులకు ఇబ్బంది కలుగకుండా క్యూలైన్‌లు పరిశీలిస్తు తొక్కిసలాట లేకుండా చూశారు. పట్టణ ఎస్‌ఐ శశికుమార్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులకు మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ అన్నప్రసాదాన్ని అందించారు. మున్సిపల్ సిబ్బంది ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు చేయించారు.

గంగా భవానికి విశేష పూజలు

తాళ్లూరు: జిల్లాలో ప్రసిద్ధి చెందిన గుంటి గంగా భవాని అమ్మవారికి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో వచ్చి ఆలయ ప్రాంగణంలో పొంగళ్ళు వండి అమ్మవారికి నైవేద్యం పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. పలువురు భక్తులు చీరలు సమర్పించారు. ఆదివారం నాడు అమ్మవారికి 6,615 రూపాయల ఆదాయం వచ్చినట్లు ఆర్‌ఏ శ్రీనివాసరావు తెలిపారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా చైర్మన్ కటకం శెట్టి శ్రీనివాసరావు, ఈఓ భాస్కర్‌రెడ్డి, ఆలయాధికారి శ్రీనివాసరావు ఏర్పాట్లు చేసి పర్యవేక్షించారు. ఐ


ప్రత్యేక అలంకరణలో కోటా సత్యమాంబదేవి

కోటా సత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు

బేస్తవారిపేట: మండలంలోని గొట్టమిండ్ల కోటా సత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లె గ్రామాల్లోని పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కోటా సత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారికి అర్చనలు, సహస్రనామ, కుంకుమ పూజలు, అఖండ హారతి పూజలు చేశారు. పలు గ్రామాల భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.


అన్నప్రసాదాన్ని అందిస్తున్న చైర్మన్ కృష్ణ


పెరుమాళ్లకు చక్రస్నానం చేయిస్తున్న దృశ్యం


పల్లకీ మోస్తున్న మోతకాపులు


మిఠాయిలు కొనుగోలు చేస్తున్న భక్తులు

'సండే' సందడి

కొనకనమిట్ల: శ్రీవారి బ్రహ్మోత్సవాల వేళ వెలుగొండ క్షేత్రంలో ముగింపు ఉత్సవాలకు భక్తులు తరలి రావటంతో ఆలయ ప్రాంతంలో ఆదివారం సందడి నెలకొంది. ఎగ్జిబిషన్, మిఠాయి కొట్లు, పలు రకాల షాపులు వద్ద భక్తులు సందడి చేశారు. తిరునాళ్లకు వచ్చిన భక్తులు నోరూరించే బెల్లం మిఠాయిల కొనుగోలుపై ఆసక్తి కనబరిచారు. నేటి కాలంలో ప్రజలు పాతతరం వంటకాలు మరిచి అంతా కొత్తదనం వంటకాలపై ఆసక్తి చూపిస్తున్నారు. అయితే ఇటువంటి తిరునాళ్లల్లో బెల్లం మిఠాయిలు, పాలబెండ్లు, సన్నపూస కారాలు వంటివి వెలుస్తాయి. పల్లె ప్రజలు వాటిని కొనుగోలు చేసి ఇళ్లకు తీసుకెళుతుంటారు. భక్తుల సౌకర్యార్థం స్థానికంగానే బెల్లం, చక్కెర మిఠాయి, కారపూస, పాలబెండ్లు వంటి వాటిని తయారు చేస్తామని 15 రోజులుగా ఇక్కడే ఉంటూ మిఠాయి అమ్ముతున్నట్లు దుకాణదారులన్నారు.

ప్రభుత్వ భూములను సంరక్షించాలి


అసెంబ్లీలో మాట్లాడుతున్న గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు

గిద్దలూరు రూరల్: ప్రభుత్వ భూములను సంరక్షించే విధంగా ప్రత్యేక చట్టాలు అమలు చేయాలని స్థానిక ఎమ్మెల్యే అన్నా రాంబాబు ఆదివారం అసెంబ్లీ సమావేశంలో మాట్లాడారు. దేవాలయ మాన్యం భూములు, ఇతర ప్రభుత్వ భూములను సంరక్షించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చట్టాలు తీసుకొచ్చి రెవెన్యూ శాఖలో మార్పులు తీసుకురావాలని కోరారు. జనాభా పెరుగుతున్న దృష్ట్యా ల్యాండ్ బ్యాంక్ తగ్గుతుందని, ప్రభుత్వ భూమిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు. 110 సంవత్సరాల నుంచి ఆర్‌ఎస్‌ఆర్‌లలో కొనసాగుతున్న చుక్కల భూముల సమస్యలు పరిష్కరించేందుకు ప్రయత్నించడం చాలా సంతోషకరంగా ఉందన్నారు. ఏ ప్రాంతంలోనైనా సరే ప్రభుత్వ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, పరిశ్రమలు, ఇతర ప్రభుత్వ కట్టడాలను నిర్మించాలంటే ప్రభుత్వ స్థలాలు లేకపోవడం వల్ల అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. గిద్దలూరు నియోజకవర్గంలో ఎక్కువ శాతం ప్రభుత్వ భూములు ఇతరుల ఆధీనంలో ఉన్నాయని రెవెన్యూ శాఖల రికార్డులు చెబుతున్నాయని, వాటిని సవరించి సమస్యలు తలెత్తకుండా చూడాలని కోరారు.

చెస్ పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ


విజేతలతో పాఠశాల సిబ్బంది

మార్కాపురం: ఒంగోలులో ఈ నెల 18న జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో చెస్ చాంపియన్‌షిప్ పోటీల్లో మార్కాపురం జెడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు మంచి ప్రతిభ కనబరిచినట్లు హెచ్‌ఎం శ్రీదేవి, పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ డోలా శ్యామలదేవి ఆదివారం విలేకర్లకు తెలిపారు. ఒంగోలులోని ఆనంద్ మినీ స్టేడియంలో ఏపీ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో జిల్లా మొదటి బహుమతిని నాగస్వాతి, 3వ బహుమతి యం. స్నేహశ్రీ, సాధించినట్లు తెలిపారు. అండర్- 13 విభాగంలో 3వ బహుమతి టీవీ చంద్రిక సాధించి సత్తా చాటారని తెలిపారు. విజేతలకు స్పోర్ట్స్ అధికారి రాజేశ్వరి బహుమతులు అందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాజెక్ట్ ఎంపిక


నాజర్‌వలి

బల్లికురవ: అరటి గుజ్జుతో ఆన్‌లైన్‌లో బయోప్లాస్టిక్ తయారీతో రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైయిర్ పోటీలకు మండలంలోని కొప్పెరపాడు ఉన్నత పాఠశాల విద్యార్థి ఎంపికయ్యాడు. ఆదివారం విద్యార్థి షేక్ నాజర్ వలిని అభినందనలతో ముంచెత్తారు. పాఠశాలలో 10వ తరగతి చదువున్న నాజర్‌వలి ప్రయోగాలు ప్రాజెక్టుల తయారీపై ఉన్న మక్కువను గుర్తించిన సైన్స్ ఉపాధ్యాయులు జీ నాగేశ్వరరావు ప్రోత్సహించారు. ఇన్‌స్పైయిర్ మనక్ 2021-22 సంవత్సరానికి ఉమ్మడి ప్రకాశం జిల్లా నుంచి రాష్ట్ర స్థాయికి 15 ప్రాజెక్టులు ఎంపికైనట్లు జిల్లా విద్యాశాఖాధికారి బీ. రమేష్ ప్రకటించారు. 23, 24 తేదీల్లో కాకినాడ డీవో కార్యాలయంలో జరిగే ఆన్‌లైన్ ఎగ్జిబిషన్‌కు నాజర్‌వలి ప్రాజెక్టు ఎంపికైయింది. అక్కడ గెలుపొందితే జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేస్తారని పాఠశాల హెచ్‌ఎం పీ. శ్రీనివాసరావు తెలిపారు. విద్యార్థిని హెచ్‌ఎంతోపాటు పీఎంసీ చైర్మన్ దమ్ము అంజయ్య, సభ్యులు గ్రామ సర్పంచ్ బందారు వెంకాయమ్మ గురవయ్య, స్థానికులు అభినందించిన వారిలో ఉన్నారు.


అరటిగుజ్జుతో తయారు చేసిన బయోప్లాస్టిక్

ఆంజనేయ స్వామి తిరునాళ్ల రేపు

పొదిలి రూరల్: మండలంలోని ఏలూరు మూసి బ్రిడ్జి వద్ద ఒంగోలు-కర్నూలు రహదారి వెంబడి కొలవైయున్న అభయాంజనేయ స్వామి, వరసిద్ధి వినాయక స్వామి వార్ల 13వ వార్షికోత్సవ తిరునాళ్ల మంగళవారం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు గోము ఆకుపూజ కార్యక్రమంతో మొదలై భక్తులు పొంగళ్లు చేసి నైవేద్యాలు పెట్టి మొక్కులు తీర్చుకుంటారు. అనంతరం ఉప్పలపాడు వాస్తవ్యులు ఉలవా గోపి అధ్వర్యంలో అన్న సంతర్పణ కార్యక్రమం జరుగుతుంది. రాత్రికి ఏలూరు గ్రామస్తుల విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేశారు. ప్రభలపై పాటకచేరీ, కోలాటం, బ్రహ్మంగారి నాటకం ఉంటుందని కార్యనిర్వాహకుడు ధర్మవరపు ప్రసాద్ రెడ్డి తెలియజేశారు.


మూసీవద్ద కొలవైయున్న ఆంజనేయస్వామి

ఆధార్ అప్‌డేట్ క్యాంప్‌ను వినియోగించుకోవాలి

కొమరోలు: స్థానిక 1, 2, 3 గ్రామ సచివాలయాల పరిధిలోని ప్రజలందరూ ఆధార్ అప్‌డేట్ స్పెషల్ క్యాంప్‌ను వినియోగించుకోవాలని కొమరోలు గ్రామ కార్యదర్శి సురేష్ కోరారు. ఈ నెల 20, 21 తేదీల్లో రెండు రోజుల పాటు గ్రామ సచివాలయంలో ఆధార్ కార్డులను అప్‌డేట్ చేయనున్నట్లు చెప్పారు. 2010 నుంచి 2016 వరకు ఆధార్ నమోదు చేసుకుని ఇప్పటివరకు ఏ విధమైన మార్పులు చేయించుకోని వారందరూ తగిన ఆధారాలతో వచ్చి ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలన్నారు. సంబంధిత వలంటీర్లు కూడా వారి పరిధిలోని ప్రజలకు ఈ విషయాన్ని తెలియజేయాలని సూచించారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట మహోత్సవం


నూతనంగా ప్రతిష్ఠించిన సీతారామ లక్ష్మణుల విగ్రహాలు

చీరాల టౌన్: మండలంలోని ఈపురుపాలెం సిండికేట్ వీవర్స్‌కాలనీలో సీతా రాముల, లక్ష్మణ, ఆంజనేయ, వినాయకస్వామి వార్ల విగ్రహ ప్రతిష్టామహోత్సవాలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న విగ్రహ ప్రతిష్టామహోత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు, యజ్ఞాల అనంతరం విగ్రహ ప్రతిష్టను అవ్వారి శివకళ్యాణ్‌శర్మ బృందం పండితుల మంత్రోచ్చారణలతో శాస్త్రోక్తంగా జరిపించారు. విఘ్నేశ్వర పూజ, వాయుప్రతిష్ట, తీర్థ స్వీకరణ, యజ్ఞసాయన, మహాభిషేకంతో నూతనంగా విగ్రహ ప్రతిష్టను వైభవంగా నిర్వహించారు. అలానే అన్నసంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాలను సీతారామాంజనేయ స్వామి మందిర భక్త బృందం కమిటీ ప్రతినిధులు పర్యవేక్షించగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.